# ఉత్పత్తి, రవాణా లక్ష్యంగా ముందుకెళ్లాలి

- మార్చి నాటికి 720 లక్షల టన్నుల లక్ష్యం
- లక్ష్యాలు సాధిస్తే ఈ ఏడాది 40 వేల కోట్ల టర్నోవర్.. రూ.3,500 కోట్ల లాభాలు సుసాధ్యం
- అన్ని ఏరియాల జీఎంలకు సీఎండీ శ్రీధర్ దిశానిర్దేశం



వీసీలో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ శ్రీధర్

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 3 : మిగిలిన ఆరు నెలల కాలంలో రోజుకు కనీసం 2.10 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరపాలని, తద్వారా మార్చి నెలాఖరు కల్లా 720 లక్షల టన్నుల వార్షిక లక్ష్యాన్ని దాటాలని సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి ఆయన సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంలతో ఉత్పత్తిపై సమీక్షించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి ఆరు నెలల కాలంలో వర్షాల వల్ల కొంత ఇబ్బంది కలిగినప్పటికీ, అన్ని రకాల అవరోధాలను అధిగమిస్తూ గత ఏడాదిపై బొగ్గు రవాణాలో 12 శాతం వృద్ధిని, బొగ్గు ఉత్పత్తిలో ఏడు శాతం వృద్ధిని, ఓబీ తొలగింపులో దాదాపు 15 శాతం వృద్ధిని సాధించడంపై సీఎండీ హర్షం ప్రకటించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా మిగిలి ఉన్న ఆరు నెలల కాలం ఎంతో కీలకమైందని, బొగ్గుకు తీవ్రమైన డిమాండ్ వస్తోందని, అన్ని ఏరియాలకు అవసరమైన యంత్రాల అనుమతులు, ఓబీ కాంట్రాక్టులు ఇప్పటికే సమకూర్చామన్నారు. అన్ని ఏరియాలు తమకు ఇచ్చిన లక్ష్యాలు సాధిస్తే ఈ ఏడాది నిర్దేశిత 720 లక్షల టన్నుల వరకు బొగ్గు ఉత్పత్తి, రవాణా చేసే అవకాశం ఉందన్నారు. తద్వారా రూ.40 వేల కోట్ల టర్నోవర్, సుమారు రూ.3,500 కోట్ల లాభాలు సాధించే అవకాశం ఉందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు అర్ధ సంవత్సరంలో సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణాలో నిర్దేశిత లక్ష్యాలను సాధించిందని, ఈ అర్ధ సంవత్సరానికి బొగ్గు రవాణా లక్ష్యం 307 లక్షల టన్నులు కాగా.. ఈ లక్ష్యాన్ని దాటి 330 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిపి 7 శాతం వృద్ధిని నమోదు చేసిందన్నారు. సమావేశంలో డైరెక్టర్లు బలరాం, సత్యనారాయణరావు, ఎన్‌వీకే శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్‌రెడ్డి, అడ్వైజర్ సురేంద్ర పాండే, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జే.అల్విన్, జనరల్ మేనేజర్ సురేష్, జీఎం సీపీపీ జక్కం రమేష్, జీఎం మల్లెల సుబ్బారావు, దేవేందర్, మోహన్‌రెడ్డి, కార్పొరేట్‌లోని వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.

## నేటి నుంచి పాపికొండల విహార యాత్ర షురూ..

భద్రాచలం, అక్టోబర్ 3 : పాపికొండల విహార యాత్ర బుధవారం నుంచి ప్రారంభం కానున్నది. గోదావరిలో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో తెలంగాణ టూరిజం వెబ్‌సైట్‌లో పాపికొండల బోటింగ్ టికెట్లు అందుబాటులో ఉంచింది. 95026 72702 నెంబర్‌కు కాల్ చేసి టికెట్లు పొందవచ్చని బోటు నిర్వాహకులు తెలిపారు. పెద్దలకు టికెట్ రూ.950, పిల్లలకు రూ.750 చెల్లించాలని, ఈ ధరలు కేవలం వెహికిల్ ఉన్నవారికి మాత్రమేనని, వెహికల్ లేనివారు అదనంగా మరో రూ.300 చెల్లించాల్సి ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## నల్లబ్యాడ్జీలతో కార్మికుల నిరసన

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 3 : సీఐటీయూ కోలిండియా కార్మికుల సెప్టెంబర్ నెల వేతనాలను నిలిపివేతను నిరసిస్తూ ఆందోళన చేపట్టారని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ అన్నారు. ఏరియాలోని పీవీకే, జీకేవోసీ, కార్పొరేట్ సెంట్రల్ వర్క్‌షాప్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో వై.వెంకటేశ్వరరావు, గాజుల రాజారావు, ఎలగొండ శ్రీరామూర్తి, పి.నాగేశ్వరరావు, గౌతం, హరీష్, సూరం అయిలయ్య, కే.సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## జేఏ గ్రేడ్-2 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన


అభ్యర్థులతో మాట్లాడుతున్న జీఎం

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 3 : సింగరేణి సంస్థ నిర్దేశించిన జూనియర్ అసిస్టెంట్ గ్రేడ్-2 రాత పరీక్షలో అర్హత సాధించిన 177 పోస్టుల భర్తీ కోసం సింగరేణి ప్రధాన కార్యాలయంలో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం పర్సనల్ కే.బసవయ్య మాట్లాడుతూ.. రెండు రోజులపాటు అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతుందని తెలిపారు. తొలిరోజు 85 మందికి..75 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించామని చెప్పారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం అభ్యర్థులను సింగరేణి ప్రధాన ఆస్పత్రి మెడికల్ పరీక్షల కోసం పంపి అనంతరం వారికి నియామక పత్రాలను అందజేస్తామన్నారు. మిగిలిన అభ్యర్థులకు బుధవారం సర్టిఫికెట్ పరిశీలన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏజీఎం పర్సనల్ కే.శ్రీనివాసరావు, డీజీఎం పర్సనల్ వేణుగోపాలరావు, పర్సనల్ మేనేజర్ సీవీఎస్ మూర్తి, డీవైపీఎంలు నాగేశ్వరరావు, సంతోష్‌కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.

## మోదీ దిష్టి బొమ్మ దహనం



జూలూరుపాడు, అక్టోబర్ 30 : కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేసి, రైతుల మృతికి కారణమైన కేంద్ర మంత్రి అజయ్‌మిశ్రాను మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని కోరుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో దహనంచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ,సీపీఎం,సీపీఐఎంఎల్(న్యూడెమోక్రసీ)నాయకులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత ప్రత్యేక క్యాంపెయిన్ ప్రారంభం

రామవరం, అక్టోబర్ 3 : సింగరేణి కొత్తగూడెం ఏరియా ఆర్‌సీహెచ్‌పీలో స్వచ్ఛత ప్రత్యేక క్యాంపెయిన్ 3.0 ను ఏరియా జీఎం శాలెంరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ కోల్ మినిస్ట్రీ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో 1.10.2023 నుంచి 31.10.2023 వరకు పని స్థలాల్లో పరిసర పరిశుభ్రత, కార్యాలయాలు, కాలనీలను సుందరీకరణ తదితర కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఉద్యోగి స్వచ్ఛతకు రోజువారీ గంటలలో కొంత సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం జీవీ కోటిరెడ్డి, ఎస్‌కే కరీముల్లా, ఎస్ఈ విశ్వేశ్వరరావు, అజ్మీరా శ్రీనివాస్, డీవైఎస్ఈ రాజేశ్వరరావు, ఎస్‌కే గౌస్, పూర్ణచంద్రరావు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.




# సీఎం బ్రేక్ ఫాస్ట్‌కు ఐదు స్కూళ్లు

**నియోజకవర్గానికో స్కూల్‌లో ప్రారంభించేలా చర్యలు**
**పాఠశాలలను పరిశీలించిన అదనపు కలెక్టర్**

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 3 : ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ఈనెల 6వ తేదీన ప్రారంభించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. కలెక్టర్ వీపీ గౌతమ్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, డీఈవో సోమశేఖర శర్మలు కలిసి తొలుత పథకాన్ని ప్రారంభించే స్కూళ్లను ఎంపిక చేయనున్నారు. మంగళవారం నగరంలోని రోటరీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ సత్యప్రసాద్.. డీఈవోతో కలిసి సందర్శించారు. పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, విద్యార్థుల సంఖ్యను హెచ్‌ఎం మోతుకూరి మధును అడిగి తెలుసుకున్నారు.

**నియోజకవర్గానికో స్కూల్‌లో...**

సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని నియోజకవర్గానికో స్కూల్‌లో ప్రారంభించేలా విద్యాశాఖ పాఠశాలలను ఎంపిక చేసే ప్రక్రియను వేగవంతం చేసింది. జిల్లా పరిధిలో ఖమ్మం, మధిర, వైరా, సత్తుపల్లి, పాలేరు నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రాథమికంగా ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో స్కూల్‌ను గుర్తించారు. వీటిని అదనపు కలెక్టర్ సందర్శించి కలెక్టర్‌కు నివేదించనున్నారు. వీటితోపాటు మధ్యాహ్న భోజన పథకం అందించే నిర్వాహకులే సీఎం బ్రేక్‌ఫాస్ట్‌ను అందించేందుకు వారి సమర్థతను పరిశీలించనున్నారు.

**ప్రాథమికంగా గుర్తించిన స్కూళ్లు**

| నియోజకవర్గం | స్కూల్ | విద్యార్థులు |
|---|---|---|
| ఖమ్మం | రోటరీనగర్ జడ్పీహెచ్ఎస్ | 246 |
| పాలేరు | జలగంనగర్ స్కూల్ | 284 |
| మధిర | కంభంపాడు స్కూల్ | 109 |
| వైరా | గుట్టబడి పీఎస్ | 140 |
| సత్తుపల్లి | పీఎస్ సత్తుపల్లి | 249 |

ఆయా పాఠశాలలను విద్యాశాఖాధికారులతోపాటు అదనపు కలెక్టర్ బుధవారం పరిశీలించిన తర్వాత ఆమోదించనున్నారు.

## యువకుడి ఆత్మహత్య


కంచర్ల మధు (ఫైల్)

చంద్రుగొండ, అక్టోబర్ 3 : ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మండలంలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. చంద్రుగొండ ఎస్సీ కాలనీకి చెందిన కంచర్ల రాములు, మారుతమ్మలకు ఇద్దరు సంతానం. వీరిలో పెద్దకుమారుడు మధు(23)సత్తుపల్లి పట్టణంలోని డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్నాడు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం పాత ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారు గమనించగా ఉరేసుకొని కుళ్లిన స్థితిలో మధు(23) మృతదేహం కనిపించింది. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు ఎస్సై మాచినేని రవి కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# ఎస్‌ఏల బదిలీలు పూర్తి

**జడ్పీకి 619 మంది, ప్రభుత్వ స్కూళ్లకు 104 మంది బదిలీ**

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 3 : జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు విజయవంతంగా ముగిశాయి. మంగళవారం ఉదయం 4 గంటలకు సంబంధిత ఉపాధ్యాయులకు బదిలీల ఉత్తర్వులను అందజేశారు. ఈ మేరకు బదిలీ అయిన టీచర్లు పాఠశాలల్లో రిపోర్ట్ చేశారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ పాఠశాలల్లో వివిధ సబ్జెక్టులు బోధిస్తున్న స్కూల్ అసిస్టెంట్ల బదిలీ జాబితాలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా నిబంధనల ప్రకారం బదిలీలను చేపట్టారు.

**అర్ధరాత్రి అంతా విధుల్లోనే..**

స్కూల్ అసిస్టెంట్ల పరిధిలో తెలుగు, హిందీ, ఫిజికల్ డైరెక్టర్ ఈ మూడు సబ్జెక్టులు మినహా.. మిగతా సబ్జెక్టులకు సంబంధించిన స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ఉత్తర్వులను విడుదల చేశారు. ఆదివారం రాత్రి వరకు ఎడిట్ ఆప్షన్స్‌కు అవకాశం ఇచ్చారు. సోమవారం బదిలీలపై కసరత్తు చేసి ఉన్నతాధికారుల ఆదేశాల కొరకు వేచి చూశారు. ఆర్జేడీ, ఉన్నతాధికారులతో సహా సోమవారం రాత్రి అంతా కార్యాలయంలోనే బదిలీల తతంగం పూర్తి చేశారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో బదిలీల ప్రక్రియను పూర్తి చేసి ఉత్తర్వులను విడుదల చేశారు.

**723 మందికి బదిలీలు..**

బదిలీకి రెండేళ్లు అర్హతగా, 8 ఏళ్లు పూర్తయిన వారు తప్పనిసరి బదిలీ కావాల్సి ఉండగా.. జిల్లాలో మొత్తం 723 మంది స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. మండల, జిల్లా పరిషత్ స్కూళ్లలో 619 మంది బదిలీ కాగా.. ప్రభుత్వ పాఠశాలల్లో 104 మంది బదిలీ అయ్యారు. వెంటనే సంబంధిత పాఠశాలల్లో హెచ్‌ఎంల నుంచి రిలీవ్ అయి నూతన పాఠశాలల్లో జాయిన్ అయ్యారు.

# అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వెంకటకృష్ణ

ఖమ్మం రూరల్, అక్టోబర్ 3 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందిన సంఘటన ఆరెంపుల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందికొండ కవిత(50), జాన్ డేవిడ్ రతన్‌రాజు దంపతులకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. వారిలో పెద్ద కొడుకు ధర్మరాజు తొమ్మిదేళ్ల క్రితం మృతిచెందాడు. అయితే సుజాత తల్లిదండ్రులు, సోదరులు సైతం చనిపోవడంతో వారి పేరున ఉన్న 8.10 గుంటల భూమి సుజాత పేరుపై పట్టా అయ్యింది. ఇందులో కొంత భూమిని అమ్ముకున్న సుజాత దంపతులు నల్లగొండలో ఓ డూప్లెక్స్ ఇల్లు కొనుగోలు చేశారు. మిగిలిన భూమిని సైతం అమ్మడంతో సుజాత, ఆమె భర్త జాన్ డేవిడ్‌రాజ్‌ల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో తరచూ గొడవలు రావడంతో సుజాత అలిగి వెళ్లిపోయింది. ఈ క్రమంలోనే బొల్లారం శివకుమార్ అనే వ్యక్తితో సుజాతకు పరిచయం ఏర్పడింది. సుజాతను తనవైపు తిప్పుకొని మండలంలోని ఆరెంపుల గ్రామంలో ఇల్లు కొనుక్కొని నివాసం ఉంటున్నారు. వీరి మధ్య సైతం గొడవలు రావడంతో అప్పుడప్పుడు చిన్న కొడుకు జాన్ ప్రిస్కిల్లా రాజ్‌కు పోన్ చేసి తన గోడు చెప్పుకునేది. ఈ సందర్భంలోనే మంగళవారం ఉదయం సుజాత నివాసం ఉంటున్న ఇంటి నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు స్థానిక సర్పంచ్‌కు, భర్తకు విషయం తెలిపారు. దీంతో వారు రూరల్ పోలీసులకు సమాచారం చేరవేశారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్సై వెంకటకృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని ఇంట్లోకి వెళ్లి చూడడంతో సుజాత మృతదేహం కనిపించింది. ఖమ్మం ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి మృతదేహాన్ని తరలించి.. కొడుకు జాన్ ప్రిస్కిల్లా రాజ్‌కు సమాచారం అందజేశారు. తన తల్లి మరణానికి శివకుమార్ కారణమని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.